జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- గొర్రిపూడిలో ఎన్నికల ప్రచారం

కరప: అవినీతి రహితంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందాలన్నా, రాష్ట్రం ప్రగతి సాధించాలన్నా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని, అందుకే వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించి జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం గొర్రిపూడిలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలతో కలసి ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ గ్రామకమిటీ అధ్యక్షుడు చీకాల సుబ్బారావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చీకాల అప్పలరాజు తదితర పార్టీ నాయకులతో కలసి మోటార్‌సైకిళ్లపై, ఆటోలపై పార్టీ కార్యకర్తలు స్వాగతం పలికి ఇంటింటికీ తీసుకెళ్లగా ఎమ్మెల్యే కన్నబాబు ఎన్నికల ప్రచారం చేశారు. ముందుగా అంబేడ్కర్‌కాలనీలో ఎమ్మెల్యే కన్నబాబు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. గ్రామంలో మహిళల నుంచి అపూర్వ స్పందన లభించింది. ఇంటింటికీ తిరిగినప్పుడు మహిళలు స్వాగతం పలికి, ఫ్యాన్ గుర్తుకు ఓటేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. తర్వాత రామాలయాల్లో, దుర్గాదేవి, నూకాలమ్మ, బసవేశ్వరస్వామి ఆలయాల్లో కన్నబాబు పూజలుచేసి, ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత అయిదేళ్లలో సీఎం జగన్ విప్లవాత్మకమైన సంస్కరణలతో పాలన సాగించడమే కాకుండా, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించారన్నారు. గొర్రిపూడిలో ఎన్నో అభివృద్ధి పనులు చేశామని, డీబీటీ, నాన్ డీబీటీల ద్వారా ప్రజలకు రూ 49.74 కోట్ల లబ్ధి చేకూర్చినట్టు వివరించారు. సంక్షేమ పథకాలు కొనసాగించాలన్నా, రాష్ట్ర అభివృద్ధి సాగాలన్నా వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్‌గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను గెలిపించి తద్వారా జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, మండలపార్టీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, వలసపాకల, పాతర్లగడ్డ, గొడ్డటిపాలెం సర్పంచ్‌లు వాసంశెట్టి రామారావు, నాగిరెడ్డి ఏసుబాబు, వాసంశెట్టి శ్రీనుబాబు, మండల సలహా సంఘం చైర్మన్ కోట వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కానూరి హరిబాబు, ఎర్రంనీడి సుబ్రహ్మణ్యం, పుణ్యమంతుల గంగరాజు తదితరులు పాల్గొన్నారు.


గొర్రిపూడిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కరపలో వైఎస్సార్ సీపీ శ్రేణులు..

కరప: గ్రామంలో శుక్రవారం వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నాయకులు ఎన్నికల ప్రచారం చేశారు. సీఎం జగన్ సారథ్యంలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. ఆయనతో పాటు ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌ను ఫ్యాన్‌గుర్తుపై ఓటేసి గెలిపించాలని తద్వారా సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరుతూ ఇంటింటా ప్రచారం చేశారు. సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు మేడిశెట్టి సత్తిబాబు, ఉప సర్పంచ్ భోగిరెడ్డి సూర్యనారాయణ, మండల యూత్ అధ్యక్షుడు పెంకే సత్తిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు సాదే లోహిదాస్, నక్కా సత్తిబాబు పాల్గొన్నారు.


కరపలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

భర్త కన్నబాబు విజయమే లక్ష్యంగా శ్రీవిద్య ప్రచారం

కాకినాడ రూరల్: ఎన్నికల ప్రచారం వేడెక్కింది. ఒక పక్క మండుతున్న ఎండలు, మరో పక్క ప్రచార పర్వాల జోరు. బరిలో నిలిచిన అభ్యర్థులు ముమ్మర ప్రచారం చేస్తుండగా, వారికి మద్దతుగా గ్రామస్థాయిలో వారి కుటుంబ సభ్యులు, పార్టీ శ్రేణులు, అభిమానులు చేతనైన శక్తి కొలదీ ప్రచారం చేస్తున్నారు. రూరల్ నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ తరఫున పోటీలో నిలిచిన సిట్టింగ్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబుకు మద్దతుగా ఆయన సతీమణి శ్రీవిద్య పార్టీ మహిళా నాయకులతో, అభిమానులతో కలసి ప్రచారంలో ముందుకు సాగిపోతున్నారు. నగర పరిధిలోని 49వ డివిజన్‌లో కొన్ని రోజులు పాటు ప్రచారం చేపట్టిన ఆమె శుక్రవారం సాయంత్రం నుంచి వలసపాకల గ్రామంలో ప్రచారం ప్రారంభించారు. ఇక్కడి గంగరాజునగర్‌లో ఆమె తోటి కోడలు చైతన్య, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జోనల్ ఇన్‌చార్జి జమ్మలమడక నాగమణి, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు వర్థినీడి సుజాత, మాజీ కార్పొరేటర్ సుజాత, జనసేన నుంచి ఇటీవలే వైఎస్సార్ సీపీలో చేరిన మాకినీడి శేషుకుమారి తదితరులు పాల్గొన్నారు.


గంగరాజునగర్‌లో కన్నబాబుకు మద్దతుగా ప్రచారం చేస్తున్న ఆయన భార్య శ్రీవిద్య

క్లుప్తంగా

గంగమ్మతల్లిని దర్శించిన ఎమ్మెల్యే కన్నబాబు


గంగమ్మతల్లిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కన్నబాబు

కరప: మండలం వలసపాకల గ్రామంలో శుక్రవారం నూతనంగా నిర్మించిన గంగమ్మతల్లి ఆలయ ప్రారంభోత్సవం జరిగింది. యాదవుల ఆరాధ్యదైవమైన గంగమ్మతల్లి ప్రతిరూపమైన నావుతాళ్లను తాటాకుల బుట్టలో పెట్టి పూజించడం ఇక్కడి ఆచారం. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అమ్మవారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే రూ.10 లక్షలు ఇచ్చినట్టు సర్పంచ్ వాసంశెట్టి రామారావు తెలిపారు.

నేటి నుంచి బృహతి సహస్ర యాగం

బోట్‌క్లబ్: స్థానిక రామారావుపేటలోని మధ్వసభలో శనివారం నుంచి రెండు రోజులు పాటు బృహతి సహస్ర యాగం నిర్వహిస్తున్నారు. మధ్వసభ కమిటీ ఏర్పడి 147 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ హోమాన్ని సుధా పండితుడు కానుగోవు వాసుదేవాచార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం ఎనిమిదిన్నర గంటలకు సంకల్ప పూర్వకంగా ఈ యాగాన్ని ప్రారంభిస్తున్నారు. విష్ణు సహస్ర నామాలతో కూడిన సుమారు 36 వేల నామాలతో హోమాది కార్యక్రమాలు నిర్వహిస్తారు. గరుడ రూపంలో హోమగుండాన్ని నిర్మించి రుత్వికులు దీక్షా బద్ధులై హోమాన్ని రెండు రోజులు పాటు నిర్వహించనున్నారు. ఆదివారం మధ్యాహ్నం పూర్ణాహుతితో ఈ విశేష కార్యక్రమం పూర్తి కానుంది.

జీవించే హక్కు ఇతివృత్తంగా 'మెర్సీ కిల్లింగ్'


కాకినాడ మల్టీప్లెక్స్ థియేటర్‌లో విలేకర్లతో మాట్లాడుతున్న చిత్ర యూనిట్

బోట్‌క్లబ్: ప్రతి వ్యక్తికీ భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం జీవించే హక్కు ఉందనే అంశాన్ని ఇతివృత్తంగా తీసుకుని నిర్మించి మెర్సీ కిల్లింగ్ చిత్రాన్ని స్థానిక మల్టీప్లెక్స్ థియేటర్లలో కొందరు నటీనటులు శుక్రవారం తిలకించారు. నగరానికి చెందిన సిద్ధార్థ, మాధవి నిర్మించగా పార్వతీశం, ఐశ్వర్య, హారిక, సాయికుమార్, శేషు ప్రధాన పాత్రల్లో నటించారు. సాయి సిద్ధార్థ మూవీ మేకర్స్ బ్యానర్‌పై ఈ చిత్రం నిర్మించగా ఎస్.వెంకటరమణ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా లైనింగ్ ప్రొడ్యూసర్ పఠాన్ వలీ ఖాన్, శివకోటి బాబీ మాట్లాడుతూ దేశంలో ప్రతి మనిషికీ జీవించే హక్కు ఉందని, అనాథ బాలిక కథాంశంతో సమాజంలో గౌరవంగా బతకాలని, చనిపోయినా అదే గౌరవం కలిగి ఉండాలనే కథతో ఈ చిత్రాన్ని నిర్మించినట్లు చెప్పారు. కాకినాడ పరిసర ప్రాంతాల నటులకు ఇందులో అవకాశం కల్పించామని అందువల్ల ఈ చిత్రం చూసిన ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోందని ఆయన తెలిపారు.

పంచారామ క్షేత్రం భక్తులకు ఉచిత వసతి

ఈఓ బళ్ల నీలకంఠం

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రానికి వచ్చే భక్తులకు వేచి ఉండే అవకాశం కల్పిస్తున్నట్లు ఈఓ బళ్ల నీలకంఠం తెలిపారు. పట్టణానికి దూరంగా గోదావరి కాలువ ఆవలి వైపు పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి కుమారా రామభీమేశ్వరస్వామి ఆలయం ఉంది. దాంతో సుదీర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు విశ్రాంతి తీసుకోవడానికి అవకాశం లేదు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆలయాన్ని మూసి వేస్తారు. ఆ సమయంలో భక్తులకు దర్శనం ఉండదు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఎండలో నిరీక్షించాల్సి పరిస్థితి ఉండడంతో అక్కడికి సమీపంలోని మాండవ్యనారాయణ స్వామి ఆలయం సమీపంలో ఉన్న కల్యాణ మండపంలో భక్తులు వేచి ఉండేలా ఏర్పాట్లు చేశారు. భక్తులు ప్రతి రోజు ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని ఈఓ వివరించారు. అలాగే ఆలయంలో నిత్యం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అన్నప్రసాద వితరణ జరుగుతుందని భక్తులు దానిని స్వీకరించాలని ఆయన కోరారు. వివరాలకు ఆలయ సెల్ నెంబరు 79893 89266ను సంప్రదించాలన్నారు.

వలసపాకలలో ప్రచారం

కరప: మండలం వలసపాకల గ్రామంలో శుక్రవారం నియోజకవర్గ జేఎస్‌పీ, టీడీపీ, బీజేపీ కూటమి అభ్యర్థి పంతం నానాజీ తరఫున కూటమి నాయకులు ఎన్నికల ప్రచారం చేశారు. నియోజకవర్గ టీడీపీ కో ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, జేఎస్‌పీ నాయకులు పాల్గొన్నారు.

సామాజిక చైతన్యంలో సంస్కారభారతి కృషి ప్రశంసనీయం


కవి సమ్మేళనంలో మాట్లాడుతున్న సంస్కార భారతి జిల్లా అధ్యక్షుడు వింజరపు జనార్దనం

బోట్‌క్లబ్: లలిత కళల ద్వారా సమాజంలో చైతన్యం తీసుకువస్తున్న సంస్కార భారతి కృషి ప్రశంసనీయమని భారతీయ సాహిత్య పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు ప్రముఖ సాహితీవేత్త కాశీభొట్ల సత్యనారాయణ అన్నారు. స్థానిక మెహర్‌నగర్‌లో సంస్కార భారతిలో శుక్రవారం ఉగాది వసంతం నిర్వహించింది. ఆస్వాదన సాహితీ సంస్థ వ్యవస్థాపకుడు గొట్టుముక్కుల వేంకట సత్యనరసింహశాస్త్రి ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించారు. సంస్కార భారతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వింజరపు జనార్దనం మాట్లాడుతూ తమ సంస్థ తరఫున వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా కవులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి వేంకటేశ్ నాయుడు, పంచాంగకర్త సరిపెల్ల శ్రీరామచంద్ర మూర్తి, పలువురు కవులు పాల్గొన్నారు.

బాలల హక్కులు కాపాడాలి

కాకినాడ రూరల్: చిన్నారులకు అనేక హక్కులు ఉంటాయని వాటిని వారు అడగలేరని, అయితే ఆ అవసరాలను పెద్దలు తీర్చాలని జిల్లా బాలల సంక్షేమాధికారి సీహెచ్ వెంకట్రావు పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్ బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వారు సురక్షితంగా జీవించే ప్రాథమిక హక్కును పెద్దలే కల్పించాలన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, రేలంగి బాపిరాజు, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి రాకుండా చర్యలు


వేసవి నీటి ఎద్దడిపై సమీక్షా సమావేశంలో ఎంపీడీఓ రమేష్‌నాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ శ్రీదేవి, తదితరులు

- ఎంపీడీఓ రమేష్‌నాయుడు
- అధికారులతో సమీక్ష

కాకినాడ రూరల్: వేసవి ఎండలు తీవ్రంగా ఉన్నందున గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్‌శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ రమేష్ నాయుడు కోరారు. సర్పవరం జంక్షన్ వద్ద మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో శుక్రవారం ఆయన ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ శ్రీదేవి, ఏఈ మారుతీ రామ్ తదితరులతో ఈ విషయమై సమీక్షించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో తాగునీటి నమూనాలు సేకరించి పరీక్షలకు పంపాలని వారికి సూచించారు. తూరంగి గ్రామంలో కొన్ని ప్రాంతాలలో నీటి ఎద్దడి నివారణపై వారు చర్చించారు. ఇండ్లలోని మోటార్ల ద్వారా కుళాయి నీటిని అక్రమంగా లాగేస్తుండడంతో శివారు ప్రాంతాలకు నీరు సక్రమంగా చేరడం లేదని తేలడంతో ప్రతి ఒక్కరికీ నీటిని అందించేందుకు ఎక్కువ సేపు సరఫరా ఉండేలా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. సమావేశంలో ఈఓపీఆర్డీ నాగేంద్రకుమార్, పంచాయతీ కార్యదర్శులు పాండురంగారావు, గోవిందరాజు, వరప్రసాద్, సత్యనారాయణ, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

ఏలేశ్వరం: పట్టణంలో శుక్రవారం వాలీబాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. స్థానిక కంబాలపాలెం కాలనీలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ వాలీబాల్ టోర్నమెంట్‌ను మున్సిపల్ కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపాలకృష్ణ, అలమండ చలమయ్య, మూది నారాయణస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే పోటీల్లో 24 జట్లు పాల్గొంటాయని తెలిపారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కోనాల వెంకటరమణ, యండగండి నాగబాబు, పెంద్ర శ్రీను, క్వారీ యూనియన్ అధ్యక్షుడు కుప్పుల నాగభూషణం, జై భీమ్ యూత్ సభ్యులు కుప్పుల కాశీ, గుమ్మాల రాంబాబు, నీలపల్లి నాగు, పిల్లా రవి, కండెల్లి రాజు, దుండి శ్రీను, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థీ ప్రతిభ కనబరచాలి

జిల్లా విద్యా శాఖాధికారి రమేష్


టోఫెల్ పరీక్షా విధానాన్ని పరిశీలిస్తున్న డీఈఓ రమేష్

పెద్దాపురం: ప్రతీ విద్యార్థీ తమలో దాగివున్న ప్రతిభను కనపర్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా విద్యా శాఖాధికారి పి.రమేష్ అన్నారు. స్థానిక బాలికోన్నత పాఠశాలలో జరుగుతున్న టోఫెల్ పరీక్షా కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పరీక్షా విధానం తీరుపై ఆరా తీశారు. ఆయన వెంట ఎంఈఓ ప్రభాకరశర్మ, హెచ్ఎం బాపూజీ, సీఆర్‌పీ ప్రకాష్ తదితరులున్నారు.

తుని నుంచి భద్రాచలానికి బస్సు సర్వీసులు

తుని: శ్రీరామ నవమి సందర్భంగా భద్రాది రాముని కల్యాణోత్సవాలకు వెళ్లే భక్తుల కోసం తుని నుంచి భద్రాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్టు స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ కిరణ్ కుమార్ శుక్రవారం తెలిపారు. తుని నుంచి బయలుదేరు బస్సులకు రిజర్వేషన్ సదుపాయం కలదన్నారు. తుని పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 73829 13216, 73829 21904 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఎన్నికల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి


ఎన్నికల విధులపై ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ ఇస్తున్న ఆర్వో వెంకటరావు

- ఈఆర్వో వెంకటరావు
- ఎన్నికల సిబ్బందికి శిక్షణ

కాకినాడ: రానున్న సాధారణ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించడంలో సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు పేర్కొన్నారు. స్థానిక పీఆర్ ప్రభుత్వ కళాశాల ఆవరణలో ఎన్నికల విధులపై ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శుక్రవారం శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి వెంకటరావు మాట్లాడుతూ తొలి విడత శుక్ర, శనివారాలలో రెండు రోజుల పాటు పీఓ, ఏపీఓలకు ఈ శిక్షణ ఉంటుందన్నారు. విధి నిర్వహణలో ఉండే పోలింగ్ సిబ్బందికి ఎన్నికల నిర్వహణ, చట్టపరమైన, సాంకేతిక పరమైన అంశాలు, ఈవీఎం, వీవీ ప్యాట్లపై సమగ్ర శిక్షణ ఇచ్చి రానున్న ఎన్నికలకు సన్నద్ధం చేయడమే శిక్షణ లక్ష్యమన్నారు. రెండో విడత ఈనెల 15, 16వ తేదీలలో ఓపీఓలకు కూడా శిక్షణ ఉంటుందన్నారు. ఆయా తేదీలలో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు శిక్షణ కొనసాగుతుందని ఆర్వో తెలిపారు. సుమారు 3300 మంది ఎన్నికల సిబ్బందికి ఈ శిక్షణ ఉంటుందన్నారు. సమావేశంలో ఎన్నికల అధికారులు, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, తహసీల్దార్ చల్లన్న దొర, ఇతర అధికారులు శిక్షణను పర్యవేక్షించారు. సుమారు 30 మంది శిక్షకులు పలు అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు.

ఆర్బీకేలో విక్రయాలకు మద్దతు ధర

- దళారులను నమ్మి మోసపోవద్దు
- జేడీఏ విజయకుమార్

కరప: రబీలో పంటకు ప్రభుత్వ నిర్ణయించిన కనీస మద్దతు ధర పొందాలంటే రైతు భరోసా కేంద్రాలు(ఆర్‌బీకే)లను సంప్రదించి, తగిన సలహాలు తీసుకుని ధాన్యం విక్రయించాలని జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకుడు (జేడీఏ) ఎన్.విజయకుమార్ తెలిపారు. మండల పర్యటనలో భాగంగా శుక్రవారం ఆయన అరట్లకట్టలోని ఆర్‌బీకేను సందర్శించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. మధ్యదళారులను, మిల్లర్లను ఆశ్రయించి, రబీలో పండించిన పంటను వచ్చిన ధరకు విక్రయించి నష్టపోవద్దని సూచించారు. ధాన్యం నమూనాలను ఆర్‌బీకేకు తీసుకు వెళితే అక్కడి టెక్నికల్ అసిస్టెంట్ ఎంత రేటు వస్తుందో చెప్తారని ఆయన వివరించారు. ధాన్యం సాధారణ రకం (కామన్) క్వింటాల్‌కు రూ.2,183, 75 కిలోల బస్తాకు రూ.1,637, గ్రేడ్‌-ఎ రకమైతే క్వింటాల్‌కు రూ.2,203, 75 కిలోల బస్తాకు రూ.1,652 వంతున కనీస మద్దతు ధర ఇస్తారన్నారు. తర్వాత జేడీఏ ఆర్‌బీకే సిబ్బందితో మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో రైతులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఏఈఓ ఎస్.సత్యనారాయణ, వీఏఏ సీహెచ్ ప్రశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


అరట్లకట్ట ఆర్‌బీకే వద్ద రైతులు, సిబ్బందికి సూచనలిస్తున్న జేడీఏ విజయకుమార్

ఇంటర్‌లో సత్తా చాటిన విద్యార్థులు

- జిల్లాలో ద్వితీయ స్థానం కైవసం చేసుకున్న వేళంగి ప్రభుత్వ జూనియర్ కళాశాల

కరప: మండలం వేళంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరంలో 59.72 శాతం, ప్రథమ సంవత్సరంలో 47.22 శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల్లో తమ కళాశాల ద్వితీయ స్థానంలో నిలిచిందని ప్రిన్సిపాల్ జీజీకే నూకరాజు శుక్రవారం తెలిపారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో 72 మందికి 34 మంది ఉత్తీర్ణులై 47.22 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ద్వితీయ సంవత్సరంలో 72 మందికి 43 మంది పాసై 59.72 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ గ్రూపులో ఏడుగురికి ఆరుగురు ఉత్తీర్ణులరు. బైపీసీలో 18 మందికి 6 గురు, సీఈసీలో 34 మందికి 16 మంది, హెచ్‌ఈసీలో 18 మందికి ఆరుగురు ఉత్తీర్ణులయ్యారు. సీఈసీ విద్యార్థి భరణికాన అమృతవాణి 459 మార్కులతో, సుంకర ప్రవంతి (సీఈసీ) 452 మార్కులతో కాలేజ్ ఫస్ట్, సెకండ్ వచ్చారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ గ్రూపులో 19 మంది పరీక్ష రాయగా 8 మంది ఉత్తీర్ణులయ్యారు. బైపీసీలో 27 మందికి 11 మంది, సీఈసీలో 25 మందికి 17 మంది, హెచ్‌ఈసీలో 9 మందికి 6 గురు ఉత్తీర్ణులయ్యారు. వడ్లమూరి వంశీ సందీప్ (ఎంపీసీ) 928 మార్కులతో, వాసంశెట్టి రాజేష్(ఎంపీసీ) 906 మార్కులతో కళాశాలకు ఫస్ట్, సెకండ్ వచ్చినట్టు ప్రిన్సిపాల్ నూకరాజు తెలిపారు.


ఇంటర్ ఎంపీసీలో కాలేజ్ ఫస్ట్ వచ్చిన వంశీ సందీప్


ఎంపీసీలో కాలేజ్ సెకండ్ వచ్చిన వాసంశెట్టి రాజేష్

కరపలో..


కరపలోని నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలోని బాలిక కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో సున్నా శాతం, ప్రథమ సంవత్సరంలో 11.9 శాతం ఉత్తీర్ణత వచ్చినట్టు హెచ్ఎం బి.స్వర్ణరాణి తెలిపారు. ప్రథమ సంవత్సరంలో 36 మందికి నలుగురు పాసయ్యారు. వీరిలో ఎంపీసీ గ్రూపులో 14 మందికి ఇద్దరు, బైపీసీలో 22 మందికి ఇద్దరు పాసయ్యారు. జి.భాగ్యలక్ష్మి (ఎంపీసీ) 302 మార్కులు, కల్యాణి (బైపీసీ) 292 మార్కులతో మొదటి రెండు స్థానాలు సాధించారు.


ఇంటర్ ఫలితాల్లో ఏఎస్‌డీ విద్యార్థుల ప్రతిభ

కాకినాడ సిటీ: ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబర్చిన అన్నవరం సత్యవతీదేవీ మహిళా ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులను ప్రిన్సిపాల్ సీహెచ్ఎస్ మూర్తిరాజు అభినందించారు. శుక్రవారం విడుదల చేసిన ఫలితాల్లో రెండో సంవత్సరం ఎంపీసీ విద్యార్థి ఎండీ మహబూబ్ ఉన్నీసా 1000కి 974 మార్కులు సాధించిందని ప్రిన్సిపాల్ తెలిపారు. అలాగే ద్వితీయ సంవత్సరం ఎండీ హఫ్జా కౌసర్ 1000కి 950 మార్కులు సాధించారన్నారు. అలాగే సెకండ్ సీఈసీ విద్యార్థి కానూరి సంధ్య 931, ఎండి సాదియ 868 మార్కులు సాధించారన్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులు ఎంపీసీ విద్యార్థి బీడీ శ్రీసాహితి 470కు 443 మార్కులు, బైపీసీ విద్యార్థి పైలా లాహరి 440కి 428 మార్కులు, సీఈసీ విద్యార్థి హుస్నా 500కు 451 మార్కులు, హెచ్‌ఈసీ విద్యార్థిని సంగాని జ్ఞానసౌజన్య 423 మార్కులు సాధించారని మూర్తిరాజు వివరించారు. విద్యార్థులను ఆయన ఇతర అధ్యాపకులతో కలిసి అభినందించారు.

ప్రతిభ చాటిన గురుకుల విద్యార్థులు..

కాకినాడ రూరల్: ఇంటర్మీడియట్ ఫలితాలలో కాకినాడ రూరల్ మండలం పి.వెంకటాపురం గ్రామంలోని డాక్టర్ అంబేడ్కర్ బాలిక గురుకుల పాఠశాల విద్యార్థినులు సత్తా చాటారు. ఇంటర్ ద్వితీయ సంవత్సర ఫలితాలలో 92 శాతంతో, ప్రథమ సంవత్సరంలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపీసీ విద్యార్థిని ఎం.సమీర 1000 మార్కులకు 956 మార్కులు సాధించింది. అలాగే ఎంపీసీలో ద్వితీయ సంవత్సర విద్యార్థిని కె.సౌమ్య 964 మార్కులు సాధించింది. ప్రథమ సంవత్సరానికి సంబంధించి బైపీసీ విద్యార్థిని బాల సాయి అచ్యుత 440 మార్కులకు 422, ఎంపీసీ విద్యార్థిని కె.షారోన్‌కుమారి 470 మార్కులకు 450 సాధించింది. ఫలితాల పట్ల ప్రిన్సిపాల్ సుశీల సంతృప్తి వ్యక్తం చేశారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినులను అభినందించారు. రమణయ్యపేటలోని ఏపీఎస్పీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు ప్రథమ సంవత్సరం ఎంపీసీలో 18 మందికి ఐదుగురు, బైపీసీలో 32 మందికి ఐదుగురు ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో 9 మందికి 9 మంది ఫైయిల్ కాగా, బైపీసీలో 24 మందికి ఆరుగురు మాత్రమే ఉత్తీర్ణులయ్యారు.


ఇంటర్ ఎంపీసీలో 964 మార్కులు సాధించిన సౌమ్య


ఇంటర్ బైపీసీలో 956 మార్కులు సాధించిన సమీర

మరిడమ్మకు ఘనంగా స్వర్ణ పుష్పార్చన

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పు మరిడమ్మ అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావు ఆధ్వర్యంలో అమ్మవారి ప్రత్యేక అభిషేకాలు, చండీ హోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


బంగారు, వెండి పుష్పాలతో పూజలు చేస్తున్న ఆలయ పండితులు

కొనసాగుతున్న వసంత నవరాత్ర పూజలు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో శుక్రవారం నాలుగో రోజు వసంత నవరాత్ర పూజలు కొనసాగించారు. ఉగాది పర్వదినం సందర్భంగా ప్రారంభమైన వసంత నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం విఘ్నేశ్వర పూజ, మహన్యాసం, కుమారా రామభీమేశ్వర స్వామికి ఏకాదశ రుద్రాభిషేకాలు, బాలాత్రిపుర సుందరి దేవికి నవావరణార్చన, నీరాజన మంత్ర పుష్పాలు, కుంకుమార్చన, దర్బారు సేవ, వేదస్వస్తి నిర్వహించారు. ఈ సందర్భంగా సాయంత్రం స్వామి వారిని అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేశారు.


పంచారామ క్షేత్రంలో స్వామివారు

ఘనంగా శిఖర పునః ప్రతిష్ఠ

అమలాపురం రూరల్: రోళ్లపాలెంలో అమలేశ్వరీదేవి సమేత అమలేశ్వరస్వామి ఆలయ శిఖర పునఃప్రతిష్ఠా మహోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శైవాగమ పండితుడు నాగేశ్వరశర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.